## చీరలు తరలిస్తున్న వాహనం పట్టివేత


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

గద్వాల అర్బన్, అక్టోబర్ 10: జిల్లా కేంద్రంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వాహనంలో మంగళవారం పెద్దమొత్తంలో చీరలు తరలిస్తున్న వాహనాన్ని టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు టౌన్ ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలో వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో వాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో పెద్ద మొత్తంలో చీరలు తరలిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. చీరల విలువ దాదాపు రూ.2లక్షలు ఉండొచ్చని అంచనా వేశారు. అనంతరం పట్టుకున్న చీరలను జిల్లా గ్రీవెన్స్ కమటీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్సై మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమంగా డబ్బులు, మందు, ఇతర వస్తువులు పెద్ద మొత్తంలో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

జడ్చర్లటౌన్, అక్టోబర్10: జడ్చర్ల పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న రెడ్డి హోటల్‌లో పనిచేస్తున్న అనిల్(23) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం ముష్టిపల్లికి చెందిన అనిల్ కొన్నిరోజులుగా జడ్చర్లలోని రెడ్డి హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో హోటల్ వంటగదిలో అనిల్ ఉరేసుకున్న విషయాన్ని మంగళవారం ఉదయం హోటల్ సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. జడ్చర్ల ఎస్సై నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల మార్చురీకి తరలించారు. సోమవారం రాత్రి హోటల్ సిబ్బందితో కలిసి మాట్లాడిన తర్వాత నిద్రించేందుకు వెళ్తున్నట్లు చెప్పి అనిల్ వెళ్లినట్లు తెలిపారు. తెల్లవారేసరికి వంటగదిలో ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడని హోటల్ సిబ్బంది తెలిపారన్నారు. అనిల్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చెరువులో పడి మహిళ మృతి

హన్వాడ, అక్టోబర్ 10: మండల కేంద్రంలో చెరువులో పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. హన్వాడకు చెందిన సాకలి అంజిలమ్మ(40) చెరువులో పడి మృతి చెందింది. అంజిలమ్మ మృతిపై అనుమానాలు ఉన్నాయని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవినాయక్ తెలిపారు. పోస్టుమార్టం కోసం జిల్లాదవాఖానకు తరలిచ్చారు. ఆమెకు కూతురు, ఇద్దరు కుమారులున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పాము కలకలం

ఊట్కూర్, అక్టోబర్ 10: మండలంలోని పెద్దజట్రం 4వ అంగన్‌వాడీ కేంద్రంలో పాము కలకలం సృష్టించిన ఘటన చోటుచేసుకున్నది. స్థానిక దళితవాడలోని అంబేద్కర్ భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలోకి పాము చేరింది. మంగళవారం ఉదయం ఆయా లక్ష్మమ్మ కేంద్రాన్ని తెరచి శుభ్రం చేస్తుండగా పాము కిటికీలోకి చేరింది. విషయాన్ని అంగన్‌వాడీ టీచర్ చెన్నమ్మకు తెలుపగా స్థానికులు కేంద్రం వద్దకు చేరుకుని గట్టిగా శబ్దం చేయడంతో కిటికీ నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రం వెనుక దట్టంగా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో విష పురుగులు సంచరిస్తున్నాయని, అధికారులు స్పందించి కేంద్రం చుట్టూ పరిసరాలను శుభ్రం చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

శ్రీరంగాపురం, అక్టోబర్ 10: మండల కేంద్రంలో నూతన సామూహిక భవనం వెనకాల వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలాన్ని ఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించారు. పానగల్ మండలం దవాజిపల్లికి చెందిన వడ్డే దాసు(35)గా గుర్తించారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాసు మరణం హత్య, ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహ్మదాబాద్, అక్టోబర్ 10: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. మహ్మదాబాద్‌కు చెందిన కొస్గి రాములు (38) వృత్తిరీత్యా తాపిమేస్త్రీ. 5వ తేదీన కూల్చివేసిన ఇంటిద వద్ద గోడపై ఇనుప సీకులు తీస్తుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి పడడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతు సోమవారం రాత్రి మృతిచెందాడు. భార్య జయమ్మ ఫిర్యాదు మేకు కేసు నమోదు చేశారు.

# కందనూలు కాంగ్రెస్‌లో ముసలం

- గాంధీ భవన్ వేదికగా కాంగ్రెస్ రచ్చ
- నాగంకే టికెట్ ఇవ్వాలని తనయుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన
- రేవంత్, కోమటిరెడ్డిని అడ్డుకునే యత్నం
- కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి టికెట్ లీకులపై ఆగ్రహం
- ఎన్నికలకు ముందే ఓటమి సంకేతాలు
- నైరాశ్యంలో హస్తం పార్టీ శ్రేణులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : కందనూలు కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు గాంధీ భవన్ వేదికగా రచ్చకెక్కాయి. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డికి టికెట్ కేటాయించాలంటూ తనయుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డిను అడ్డుకునేందుకు యత్నించగా తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో వెలుగు చూసిన ఈ వర్గవిభేదాలు నాగర్‌కర్నూల్ కాంగ్రెస్‌లో ముసలానికి తెరతీశాయి.

### గాంధీ భవన్‌లో కందనూలు కాంగ్రెస్ కొట్లాట

నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్తబ్దంగా ఉన్న కాంగ్రెస్ వర్గవిభేదాలు గాంధీ భవన్ వేదికగా వీధికెక్కాయి. మాజీ మంత్రి నాగంజనార్దన్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ కేటాయించాలంటూ తనయుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని అడ్డుకొనేందుకు నాగం అనుచరులు యత్నించారు. జై నాగం, జైజై నాగం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. శాంతియుతంగా మాట్లాడాలని గాంధీభవన్‌లో నేతలు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ టికెట్ విషయంలో అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. ఇటీవలే చేరిన కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి టిక్కెట్ కేటాయిస్తున్నట్లుగా మీడియాకు లీకులు ఇస్తున్నారని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని నిలదీసినట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని నాగం పని చేస్తుంటే, కాంగ్రెస్ టికెట్‌తో ఎమ్మెల్సీగా గెలిపించక అధికార బీఆర్‌ఎస్‌లో చేరి, అక్కడ ఉంటూనే తనయుడికి కాంగ్రెస్ టికెట్ కోసం పార్టీ మారేందుకు కూచుకుళ్ల ప్రయత్నిస్తుండడంపై అధిష్ఠానాన్ని ప్రశ్నించినట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్‌ను గాలికి వదిలేసి మళ్లీ పార్టీలోకి వచ్చే నాయకులకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇదే విషయమై గతంలో నాగం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పార్టీ నుంచి గెలిచాక కూచుకుళ్ల, జూపల్లిలాంటి నేతలు తిరిగి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లరని గ్యారెంటీ ఏమిటని నిలదీసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాజేశ్‌రెడ్డి పేరు జోరుగా వినిపిస్తోంది. ఇది కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మీడియాకు ఇచ్చిన లీకుల వల్లేనని సందేహాలు నాగం, ఆయన వర్గీయుల్లో నెలకొన్నాయి. దీనికి తగ్గట్టుగా రాజేశ్‌రెడ్డి గడపగడపకూ కాంగ్రెస్ పేరిట గ్రామాల్లో విస్తృతంగా ఓ అభ్యర్థి మాదిరిగా ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచార పర్వం నాగం, అనుచరులకు మింగుడు పడనీయడం లేదు. ఏండ్ల తరబడిగా నాగం పార్టీని కాపాడుతుంటే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి టికెట్ కేటాయించడమేంటనే ఆగ్రహం అనుచరుల్లో నెలకొన్నది. ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సైతం నాగం, తనయుడితో కలిసి టికెట్ కేటాయించాలని విన్నవించారు. ఎన్నికల కోడ్ రావడంతో త్వరలో రాజేశ్‌రెడ్డి పేరు ఖాయమనే ప్రచారం పెరగడంతో దీనికి కారణం రేవంత్‌రెడ్డేనంటూ గాంధీభవన్‌లో నాగం అనుచరులు చేసిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. కాగా కందనూలు కాంగ్రెస్‌లో టిక్కెట్ల ముసలం పార్టీలో నైరాశ్యాన్ని కలిగిస్తోంది. నాగం, కూచుకుళ్ల కలిస్తేనే పోటీలో ఉంటారని ప్రజలు భావిస్తున్న తరుణంలో ఇద్దరి పోరాటం వీధికెక్కడంతో ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌కు ఓటమి ఖాయమనే సంకేతాలను ఇస్తోందని సగటు కాంగ్రెస్ శ్రేణుల ఆవేదన.

## దవాఖాన ఎదుట బింగిదొడ్డివాసుల ఆందోళన


దవాఖాన ఎదుట ఆందోళన చేస్తున్న బింగిదొడ్డి గ్రామస్తులు

అయిజ, అక్టోబర్ 10: పట్టణంలోని ఓ దవాఖానలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ, కర్నూల్ దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని బింగిదొడ్డి పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న పరశురాముడు(42) కిడ్నీలు చెడిపోయి పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం అయిజ పట్టణంలోని సన్‌రైజ్ దవాఖానకు సోమవారం తరలించారు. మంగళవారం మధ్యాహ్నం వరకు చికిత్స అందించినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించకపోవడంతో మెరుగైన వైద్యం నిమిత్తం సన్‌రైజ్ దవాఖాన అంబులెన్స్‌లో కర్నూల్ దవాఖానకు తరలించారు. కర్నూల్‌లోని దవాఖానలో వైద్యులు పరీక్షించగా, రోగి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. దీంతో రోగి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పట్టణంలోని సన్‌రైజ్ దవాఖాన ఎదుట ఆందోళనకు దిగారు. దవాఖాన వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే వ్యక్తి మృతిచెందాడని ఆరోపించారు. రోగి పరిస్థితి గురించి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కర్నూల్‌కు ఎందుకు తరలించారని కుటుంబ సభ్యులు వైద్యులను ప్రశ్నించారు. ఎస్సై నరేశ్‌కుమార్ రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులను శాంతింపజేశారు. మధ్యవర్తులు, కుటుంబ సభ్యులు, దవాఖాన వైద్యులతో చర్చించి ఆందోళన సద్దుమణిగేలా చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే రోగి ప్రాణాలు కాపాడేందుకు కర్నూల్ దవాఖానకు తరలించామని దవాఖాన డాక్టర్ విశ్వక్ తెలిపారు.

# భారీగా నగదు పట్టివేత

- అచ్చంపేటలో రూ.లక్షా63వేలు, కొత్తకోటలో రూ.రూ.2.35లక్షలు స్వాధీనం
- క్షుణ్ణంగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు


నడింపల్లి ఎక్స్‌రోడ్డులో తనిఖీలో సీఐ, ఎస్సైలు

అచ్చంపేట, అక్టోబర్ 10 : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు వాహనాల తనిఖీలు ప్రారంభించారు. మంగళవారం పట్టణంలోని నడింపల్లి ఎక్స్‌రోడ్ వద్ద ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. అచ్చంపేట సీఐ అనుదీప్, అచ్చంపేట, సిద్దాపూర్ ఎస్సై గోవర్ధన్, శేఖర్, సిబ్బంది అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆర్టీసీ బస్సులు, కార్లు, జీపులు, ఆటోలు ఇతర వాహనాలను తనిఖీలు చేశారు. ఎన్నికల నియమావళి నిబంధనల మేరకు ప్రతి వ్యక్తి రూ.50వేలకు మించి నగదు ఉంటే సీజ్ చేస్తామని సీఐ తెలిపారు. నగదుకు సంబంధించి వివరాలు తెలియజేస్తే సీజ్ చేయమని అంత కన్నా.. ఎక్కువ డబ్బులు ఉంటే సీజ్ చేస్తామని సూచించారు. అనుమానం ఉన్న రహదారులపై వాహనాల తనిఖీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వాహనాలపై నిఘా పెంచామని అచ్చంపేట అన్నిప్రాంతాల్లో నిఘా ఉంటుందన్నారు. మంగళవారం రూ.లక్షా63వేలు నగదు సీజ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందున అనుమానంతో రూ.లక్షా 63వేలు నగదు సీజ్ చేశామని ఎస్సై గోవర్ధన్ తెలిపారు. దానికి సంబంధించి ఆధారాలు చూపిస్తే విచారణ జరిపి డబ్బులు తిరిగి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.


కారులో తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్న ఎస్సై మంజునాథ్‌రెడ్డి


గోవానుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ అధికారులు

### పట్టుబడిన రూ.2.35లక్షలు

కొత్తకోట, అక్టోబర్ 10: కొత్తకోట పట్టణ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద సోమవారం రాత్రి కారులో తరలిస్తున్న రూ.2.35లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మదనాపురం మండలం గోవిందహళ్లికి చెందిన దాసరి చంద్రశేఖర్ తన కారులో రూ.2.35లక్షలను తరలిస్తుండగా పట్టుకున్నారు. అట్టి డబ్బులను ఎన్నికల అధికారులకు డిపాజిట్ చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఒక వ్యక్తితో రూ.50వేలు మించి ఉండరాదని, ఎన్నికలు ముగిసేవరకు కోడ్ అమలులో ఉంటుందని, ఎవరైనా నగదు, ఆభరణాలను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

### అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

కృష్ణ, అక్టోబర్ 10: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అక్రమంగా పొరుగు రాష్ట్రాలైన గోవా, కర్ణాటక నుంచి మద్యం, నగదు తెలంగాణలోకి రవాణా కాకుండా మండలంలోని కృష్ణ బార్డర్ చెక్ పోస్టు వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మంగళవారం తెల్లవారుజామున మద్యం సీసాలు తరలిస్తుండగా.. ఎక్సైజ్ ఎస్సై ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ మహబూబ్‌నగర్ అధికారులు తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకుని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి, తెలిపారు. తనిఖీలో ఎక్సైజ్ సిబ్బంది మల్లనగౌడ్, సయ్యద్ బాషా, జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మహ్మద్‌పాషా, అబ్దుల్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.